క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఇచ్చోడలోని కుమురంభీం హాల్ (షార్ప్ గార్డెన్)లో శుక్రవారం నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేష్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 11.30 గంటలకు ప్రజా గాయకుడు గద్దర్, సియాసత్ సంపాదకులు జహీరొద్దీన్ అలీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన అనిల్‌జాదవ్

ఇచ్చోడ: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని అనిల్ జాదవ్ కోరారు. చైర్మన్ కలిసి వారిలో మన్నూర్ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రావు, నేరడిగొండ వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డివిజన్ దీక్షలు



దీక్షాపరులకు రాఖీ కడుతున్న చిన్నారులు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాలని చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారానికి 47వ రోజుకు చేరుకున్నాయి. కాగా దీక్షాపరులకు చిన్నారులు రాఖీలు కట్టారు. బోథ్‌ను ప్రజాప్రతినిధులు చిన్నచూపు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బోథ్ అసెంబ్లీ పరిధిలో రెండు వందల మందితో నామినేషన్లు వేస్తామన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మహేందర్ జాదవ్

నేరడిగొండ: మండల కేంద్రం గుండా వెళ్తున్న జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. గురువారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా.. ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజల, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు. మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్‌బంక్ ఎదుట ఉన్న యూటర్న్ మూసి వేయాలన్నారు.

అన్నాభావుసాఠే జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నాభావుసాఠే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నాభావుసాఠే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంరం బాగుబాయి, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, రామారావు, నాగ్‌నాథ్, సాయినాథ్, కనక హనుమంత్‌రావ్, మారుతి పాల్గొన్నారు.

అడవులను పరిరక్షించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎఫ్‌ఆర్వో గులాబ్ సింగ్ అన్నారు. గురువారం రాఖీ పండుగ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్, అంకోలి, లోకారి, పిప్పల్‌ధరి మావల మండలంలోని హరితవనం పార్క్‌లో చెట్లకు విద్యార్థులతో రాఖీలు కట్టించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించి పోతున్న ఆడవుల రక్షణ కోసం ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్లు శివ రత్న, రజిని, సాయి పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్



బేల: రాఖీ కడుతున్న విద్యార్థిని



ఇచ్చోడ: ట్రైయినీ కలెక్టర్లకు రాఖీలు కడుతున్న ఉమారాణి



నేరడిగొండ: అనిల్ జాదవ్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు



బోథ్: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని



ఉట్నూర్‌రూరల్: అన్నకు రాఖీ కడుతున్న చెల్లె



నేరడిగొండ: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



ఉట్నూర్‌రూరల్: జెడ్పీ చైర్మన్‌కు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు



తాంసి: రాఖీ కడుతున్న గంద్రత్ సుజాత



తాంసి: పొన్నారిలో..



జైనథ్: అన్నయ్యకు రాఖీ కడుతున్న జెడ్పీటీసీ

అన్నాచెల్లెళ్ల అనురాగానికి, ఆప్యాయతకు అద్దం పట్టే రక్షాబంధన్ వేడుకలను ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకొన్నారు. అక్కాచెల్లెళ్లు అన్నాదమ్ములకు రాఖీ కట్టి మురిశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మహిళలు తమ సోదరుల ఇళ్లకు వెళ్లి రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించి చల్లగా ఉండాలని దీవించారు. ఉట్నూర్‌లోని జెడ్పీ చైర్మన్ నివాసంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌కు అక్కాచెల్లెళ్లు చంగునాబాయి, సుమిత్రబాయి, అరుణబాయిలు రాఖీ కట్టి, మిఠాయి తినిపించారు. బోథ్ ఫారెస్టు కార్యాలయంలో అధికారులు చెట్టుకు రాఖీ కట్టారు. బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ నివాసంలో ఆయన సోదరీమణులు రాఖీ కట్టారు. – సాక్షి, నెట్‌వర్క్

కళాకారుడికి సన్మానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇటీవల భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవం రోజున జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జానపద సంబురాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్టు రవిని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేవీ. రమణాచారి సన్మానించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ గ్రామానికి చెందిన సిడం ప్రవళిక ఇటీవల నీట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఖమ్మం మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించింది. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న రాజ్ గోండు ఉద్యోగ సంఘం సభ్యులు గురువారం గ్రామానికి ప్రవళికకు రూ.50 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఎస్పీ సెడ్మకి గోద్రు, గొడం మోతిరాం, గొడం త్రియంబక్, కొడప కోస్రావ్, తొడసం గోపాల్, కొడప భూమన్న పాల్గొన్నారు.

రక్తదానం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర గ్రామానికి చెందిన మహిళ రక్తహీనతతో బాధపడుతూ గురువారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అత్యవసరంగా ఏబీ నెగిటీవ్ రక్తం కావాలని వైద్యులు కోరారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు సోహెల్ ఏబీ నెగిటీవ్ రక్తం దానం చేసి మానవత్వం చాటుకున్నాడు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ. లక్ష విరాళంగా అందజేశారు. గురువారం పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్‌లు అందజేశారు. అనంతరం అందూరు గ్రామంలో పోచమ్మ ఆలయానికి రూ. 20 వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, దేవిదాస్, గులాబ్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

భగీరథ’ నీరు కలుషితం

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఆర్వో వాటర్ తాగుతున్న జనాలు



మిషన్ భగీరథ ట్యాంకు

గుడిహత్నూర్: మారుమూల గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందిస్తోంది ప్రభుత్వం. తాగునీటి సమస్యకు పరిష్కరం చూపేందుకు గోదావరి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. మండలానికి సరఫరా అయ్యే నీరు నిర్మల్ సమీపంలోని మాడేగాం వద్ద శుద్ధి చేసి, సరఫరా చేస్తున్నారు. భగీరథ నీరు స్వచ్ఛమైందని తాగవచ్చని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో నీరు కలుషితం అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని వాపోతున్నారు. అనారోగ్యానికి గురవడంతో భగీరథ నీటిని తాగడం లేదని చెబుతున్నారు.

అసలు సమస్య ఎక్కడ?..

నిర్మల్ వద్ద మాడేగాం నీటి శుద్ధీకరణ కేంద్రం నుంచి వస్తున్న భగీరథ నీరు స్థానిక ఓవర్ హెడ్‌ట్యాంకులకు చేరుతోంది. అక్కడి నుంచి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. అయితే ఇక్కడే నీరు కలుషితం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇంటింటికీ సరఫరా చేసే నీటి ట్యాంకులను ప్రతీ పది రోజులకు ఒక్కసారి శుభ్రం చేయాలి. కానీ ఎక్కడా కూడా ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. ఆర్వో వాటర్ తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు..

భగీరథ నీరు కలుషితం కావడంతో ప్రజలు ఆర్వో వాటర్ తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరూ బావులు, బోర్ల నీటిని తాగుతున్నారు. అయితే ఆర్వో నీటిలో శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలు లేకపోవడంతో ఎలాంటి ఫలితం ఉండదు. సాధారణ బోరునీరు, బావినీరు సుమారు 500 నుంచి 2000 వరకు టీడీఎస్ (టోటల్ డిజాల్వడ్ సోలిడ్స్) కలిగి ఉంటుంది. ఆర్వో ఎక్కువ చేయడం ద్వారా నీటి టీడీఎస్ 20 నుంచి 30కి పడిపోతుంది. దీంతో నీటిలో ఉండాల్సిన ఖనిజ లవణాలు (మినరల్స్) పూర్తిగా కోల్పోయి యాసిడిక్ వాటర్‌గా మారుతుంది. ఈనీటిని తాగితే ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినా అధికారులు మాత్రం తనిఖీలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీరు కలుషితం కాకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గతి లేక తాగుతున్నాం



ఊళ్లో ఎవరూ మిషన్ భగీరథ నీరు తాగడం లేదు. డబ్బా నీళ్ల తాగడం మంచిదని అవే కొనుక్కొని తాగుతున్నాం. ఆ రోజు మీటింగ్ పెట్టి డబ్బా నీళ్ల కూడా తాగొద్దన్నారు. కానీ భగీరథ నీళ్ల కంపు కొడుతున్నాయి. గతి లేక ఆర్వో వాటర్ కొనుక్కొని తాగుతున్నం.

– అంకతి పోసాని, గుడిహత్నూర్

శుద్ధనీరు అందేలా చూస్తాం



ఆర్వో నీరు శరీరానికి మంచిది కాదు. భగీరథ నీరు ఎక్కడ కలుషితమవుతుందో గుర్తించి సరి చేస్తాం. పంచాయతీ సిబ్బంది తప్పని సరిగా పది రోజులకు ఒకసారి ట్యాంకు శుభ్రపర్చాలి. అప్పుడే తాగడానికి యోగ్యంగా ఉన్న నీరు వస్తుంది.

ఆదిత్య, ఏఈ మిషన్ భగీరథ, గుడిహత్నూర్

ఉపపోరు ఉన్నట్టా.. లేనట్టా?

- సర్పంచ్, వార్డు, జెడ్పీటీసీ స్థానం ఖాళీ
- నిర్వహణకు పలుమార్లు కసరత్తు



ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో స్థానిక పోరు ఇక లేనట్లే కనిపిస్తోంది. వివిధ కారణాలతో సర్పంచులు, వార్డు సభ్యులు, జెడ్పీటీసీ స్థానాలు దాదాపు మూడేళ్ల నుంచి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అయితే స్థానిక సంస్థలకు తిరిగి ఎన్నికలు నిర్వహించటానికి ఇప్పటికే మూడు సార్లు కసరత్తు జరిగింది. కాని నోటిఫికేషన్ మాత్రం వెలువడలేదు.

ఆరు నెలల్లోపు..

శాసన సభకు వచ్చే నవంబరులో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ అందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక పోరును ప్రభుత్వం తాత్కాలికంగా పక్కన పెట్టినట్లే కనిపిస్తోంది. సర్పంచులు, వార్డు సభ్యులు, జెడ్పీటీసీ స్థానాలు ఖాళీ అయితే ఆరు నెలల్లోపు తిరిగి ఎన్నికలు జరపాల్సి ఉంది. కానీ సుమారు మూడేళ్లు గడుస్తున్నా.. ఉప ఎన్నికల ఊసే కనిపించటం లేదు. మండలంలోని 34 గ్రామ పంచాయతీలుగా.. ఉండగా ఒకటి సర్పంచి స్థానాలు, ఐదు వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఒకటి జెడ్పీటీసీ స్థానం ఖాళీగా ఉంది. 2024 మార్చితో ప్రాదేశిక స్థానాల పదవీ కాలం ముగియనుంది.

మూడు సార్లు జాబితా సిద్ధం

ఎన్నికలు నిర్వహించేందుకు గతంలో పలుమార్లు ఓటరు జాబితాను సైతం సిద్ధం చేసింది. ఎన్నికల కోసం సామగ్రిని సైతం తెప్పించారు. అప్పట్లో ఖాళీగా ఉన్న గ్రామాల్లో ఎన్నికల వేడి రగులుకుని చల్లారింది. సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలు 2019 జనవరి 21న జరిగాయి. ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు 2019 మార్చిలో జరిగాయి. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ రూరల్ మండలం జెడ్పీటీసీ మరణించడంతో స్థానం ఖాళీగా ఉంది. అప్పటి నుంచి ఆ స్థానానికి ఎన్నికలు నిర్వహించలేదు.

ఆదేశాలు వస్తే నిర్వహిస్తాం

మండలంలోని పలు వార్డుసభ్యుల స్థానాలతో పాటు సర్పంచ్, జెడ్పీటీసీ స్థానం ఖాళీగా ఉంది. ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు వస్తే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– లక్ష్మీకాంత్‌రావ్, ఎంపీడీవో, ఆదిలాబాద్ రూరల్

కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సాబ్లే సంతోష్‌సింగ్

నేరడిగొండ: పేదలకు కొత్త రేషన్ కార్డులు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్‌సింగ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో ప్రజలు వీటిని పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి రేషన్ కార్డులు జారీ చేయకపోవడం శోచనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి రాములు, గంధం నవీన్, ధర్మపురి రాఘవులు, బాక్రే శేఖర్, సాబ్లే ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జాన్సన్ గెలుపునకు కృషిచేయాలి

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు, రాష్ట్ర నాయకుడు పైడిపల్లి రవీందర్‌రావు అన్నారు. గురువారం రవీందర్‌రావును పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సక్కారం శ్రీనివాస్, కారింగుల రాములు, లక్ష్మణ్‌రావు, గంగారావు, సురేశ్, సతీశ్‌రావు, బీసీ రాజన్న, గంజి నర్సయ్య, శ్రీనివాస్‌రావు, రాజన్న, బీసీ రమేశ్ ఉన్నారు.

ముఖం చాటేసిన వానలు



తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో ఇరవై రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో పంటలు వాడిపోతున్నాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుబిడి, కరంజి(టి), అంతర్గాం, గోముత్రి, అర్లి(టి) గ్రామాల్లో పత్తి, కంది, సోయా పంటలు ఎండి పోయే దశకు చేరుకున్నాయి. కొంత మంది రైతులు పంటలు కాపాడుకునేందుకు స్పింక్లర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

రోడ్డుపై మురుగునీరు



నేరడిగొండ: మండలంలోని వడూర్ జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే రహదారిపై మురుగునీరు పారుతోంది. దీంతో ఆ రహదారి గుండా వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- అధికారి పేరు: నర్సారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వడూర్, ఫోన్: 98485 41010

సప్తమి వేడుకలు

కుంటాల: శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని గురువారం కుంటాలలోని హనుమాన్ ఆలయంలో సప్తమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఆలయాల ఎదుట జెండాలను ఏర్పాటు చేశారు. ఏడు రోజులపాటు ఏకతాశం, భజన కార్యక్రమాలు చేపట్టనున్నారు.